
కమిషనర్‌ను వివరాలు అడుగుతున్న కలెక్టర్ గౌతమ్

కొంపల్లిలో ఆట స్థలాలను అభివృద్ధి చేయాలి

పేట్‌బషీరాబాద్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కొంపల్లి పురపాలక సంఘం పరిధిలోని పార్కులను అభివృద్ధి చేయాలని మేడ్చల్ కలెక్టర్ గౌతమ్‌పోట్రు మున్సిపల్ కమిషనర్ శ్రీహరికి సూచనలు చేశారు. మంగళవారం పురపాలక సంఘంలోని రాయల్ పార్కులో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రెండు రోజులుగా జరుగుతున్న స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమ వివరాలు అడిగి తెలుసుకొని విజయవంతం చేసేందుకు వార్డుల్లోని యువతను, పొదుపు సంఘాలను భాగస్వామం చేయాలని వివరించారు. మున్సిపల్ చైర్మన్ సన్నా శ్రీశైలంయాదవ్, స్పెషల్ ఆఫీసర్ వెంకటేశం, కమిషనర్ శ్రీహరి, మేనేజర్ వెంకటేశం పాల్గొన్నారు.

'టీఎన్‌జీవో కాలనీ సమస్యలను పరిష్కరిస్తా'

రాయదుర్గం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి డివిజన్ టీఎన్‌జీవో కాలనీవాసులతో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులతో ఎమ్మెల్యే మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అసంపూర్తిగా ఉన్న యూజీడీ పైపులైను పనులు, మంచి నీటి వసతి మెరుగుపర్చాలని, విధిదీపాలు, పారిశుధ్య పనులు సక్రమంగా జరిగేలా చూడాలని స్థానికులు కోరారు. దీంతో అక్కడే ఉన్న అధికారులతో సమస్యలపై చర్చించి దశలవారీగా పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, జలమండలి అధికారులు జీఎం బ్రిజేష్, డీజీఎం శరత్‌కుమార్ రెడ్డి, మేనేజర్ నరేందర్‌రెడ్డి, డీఈ విశాలాక్షి, ఏఈ జగదీష్ పాల్గొన్నారు.


శ్రీశైలంగౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న హెచ్ఎంటీ ఉద్యోగులు

హెచ్ఎంటీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

షాపూర్‌నగర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ హెచ్ఎంటీ ఉద్యోగులు మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌ను కలిసి వినతిపత్రం మంగళవారం అందజేశారు. సూరారం డివిజన్ షాపూర్‌నగర్‌లో గల ఆయన నివాసం వద్ద కలిసి ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల ఇళ్ల స్థలాలు మంజూరయ్యేలా సీఎం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో లక్ష్మణ్, అంజయ్య, కుమార్, మోహన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీహరి, ప్రకాష్, రాజశేఖర్, వెంకట్‌నారాయణ సుబ్రహ్మణ్యం, రాంబాబులు తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

'పాలస్తీనాలో శాంతి కోసం కృషి చేయాలి'

షాపూర్‌నగర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పాలస్తీనాలో శాంతి కోసం అందరూ కృషి చేయాలని, ఇజ్రాయిల్ దాడులను ఖండించాలని సీపీఎం కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ అన్నారు. మంగళవారం షాపూర్‌నగర్ రైతుబజార్ నుంచి సాగర్‌హోటల్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ.. పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులను ఆపివేయాలని, శాంతిని నెలకొల్పేలా ప్రపంచ దేశాలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బి.సత్యం, దేవదానం, అంజయ్య, శ్రీను, కరుణాకర్, మల్లారెడ్డి, పాషా, దుర్గానాయక్, శ్రీశైలం పాల్గొన్నారు.

వయనాడ్ వరద బాధితుల కోసం విరాళాల సేకరణ

నిజాంపేట్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): కేరళ వయనాడ్ వరద బాధితుల సహాయార్థం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి ప్రగతినగర్‌లో సీపీఎం బాచుపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో విరాళాలను మంగళవారం సేకరించారు. మండల కార్యదర్శి బి.వెంకటరామయ్య మాట్లాడుతూ.. ప్రకృతి విళయంలో వయనాడ్‌లో వందల మంది నిరాశ్రయులై ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతి విపత్తు వేళ కేరళకు అందరూ అండగా నిలవాలని కోరారు. మొదటి రోజు 10 వేలా రెండొందల 16లు సేకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బాలాపీర్, ప్రవీణ్ మధు, మల్లికార్జునరాజు, విద్యార్థులు ఉన్నారు.

'పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం సహకరించాలి'

షాపూర్‌నగర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం తోడ్పడాలని యూఎస్ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు ఎం.చంద్రకాంత్ అన్నారు. మంగళవారం షాపూర్‌నగర్‌లోని కార్యాలయంలో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి పూర్తిస్థాయిలో సహకారం అందించాలన్నారు. గత ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేశాయని ఆరోపించారు. విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్నం భోజనం అందించాలని కోరారు.

ప్రభుత్వ భూమిని ఆక్రమించిన బిల్డర్‌పై కేసు

● నిర్మాణాలను కూల్చిన రెవెన్యూ అధికారులు


కూల్చివేస్తున్న దృశ్యం

దుండిగల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): దుండిగల్ మున్సిపాలిటీ మల్లంపేట్ గ్రామంలో సర్వే నెంబరు 170/1లోని ప్రభుత్వ భూమిలో శ్రీలక్ష్మి శ్రీనివాస్ కన్‌స్ట్రక్షన్ నిర్వాహకులు విల్లాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ విషయమై బీజేపీ నాయకులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేస్తూ వస్తున్నారు. ఈ ఫిర్యాదుల నేపథ్యంలో తహసీల్దార్ మతిన్ ఆదేశాల మేరకు డిప్యూటీ తహసీల్దార్ అభిలాష్, ఆర్ఐ ప్రదీప్‌రెడ్డిలు మంగళవారం కూల్చివేతలు చేపట్టారు. శ్రీలక్ష్మి శ్రీనివాస్ కన్‌స్ట్రక్షన్ ఎండీ విజయలక్ష్మి సర్వేనెంబరు 170/5లో 17 విల్లాల నిర్మాణానికి అనుమతి తీసుకుని, సర్వే నెంబర్ 170/1లోనూ చేపట్టిన నిర్మాణాలపై అధికారులు కొరడా ఝుళిపించారు. అక్రమ నిర్మాణాలను కూల్చడంతో పాటు విజయలక్ష్మి ఆర్ఐ ప్రదీప్‌రెడ్డి దుం డిగల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు బిల్డర్‌పై కేసు నమోదు చేశారు.

కేబుల్ వైర్ల తొలగింపును తక్షణమే నిలిపివేయాలి

● కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాల కోసమే విద్యుత్ శాఖ కుట్ర
● కేబుల్ టీవీ అండ్ ఇంటర్నెట్ సర్వీసెస్ ప్రొవైడర్స్ అసోసియేషన్

బర్కత్‌పుర, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖ గ్రేటర్ పరిధిలోని విద్యుత్ స్తంభాలకున్న కేబుల్ వైర్లను తొలగిస్తూ వాటిపై ఆధారపడి జీవిస్తున్న లక్షలాది మంది కుటుంబాలను వీధిపాలు చేస్తున్నదని తెలంగాణ కేబుల్ టీవీ అండ్ ఇంటర్నెట్ సర్వీసెస్ ప్రొవైడర్స్ అసోసియేషన్ ఆరోపించింది. కేబుల్ వైర్ల తొలగింపును తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేసింది. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేగల సతీష్‌బాబు, ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్, ఉపాధ్యక్షులు సలీమ్ మాట్లాడుతూ.. ఎలాంటి నోటీసులు జారీ చేయకుండా విద్యుత్ శాఖ అధికారులు గ్రేటర్ పరిధిలోని ఈసీఐఎల్, బండ్లగూడ, మాదాపూర్, లాలాగూడ, బేగంపేటతోపాటు పలు ప్రాంతాలలో కేబుల్ టీవీ వైర్లను తొలగించారని, దీనివలన కేబుల్, ఇంటర్నెట్ సేవలు నిలిచిపోయి ఆపరేటర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విధి విధానాలను రూపొందిస్తే తాము విద్యుత్ స్తంభాలకు ట్యాక్స్ చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నామని, చెన్నై తరహాలో కేబుల్ వ్యవస్థను తీసుకురావాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి ఇంటర్నెట్ వ్యవస్థ కేబుల్ వినియోగదారులకు న్యాయం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు జైపాల్, పూర్ణచందర్, శివాజీ, రమణ, సతీష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

కేపీహెచ్‌బీకాలనీ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంపేటకు చెందిన సుజాత(54) తన ఫ్యామిలీ ఫ్రెండ్ వెంకటరామిరెడ్డితో కలిసి బొటిక్, ఇంటీరియర్ వ్యాపారం చేస్తోంది. సోమవారం కూకట్‌పల్లి బాగ్‌అమీర్‌లోని వెంకటరామిరెడ్డి ఇంట్లో ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహనీయుడు ప్రొ.జయశంకర్

● ఘనంగా ప్రొఫెసర్ జయంతి
● నివాళులర్పించిన నాయకులు

(జోన్‌బృందం- ఆంధ్రజ్యోతి)

తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతిని కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, శేరిలింగంపల్లిలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కాలనీలు, బస్తీలు తదితర ప్రాంతాల్లో ప్రొఫెసర్ చిత్రపటాలను ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వివేకానందనగర్‌లోని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్లు ఉప్పలపాటి శ్రీకాంత్, నార్నె శ్రీనివాసరావు జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గచ్చిబౌలి, పేట్‌బషీర్‌బాద్, ఫతేనగర్, ఓల్డుబోయినపల్లి, కేపీహెచ్‌బీ కాలనీ, కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి తదితర ప్రాంతాల్లో జయశంకర్ విగ్రహానికి నివాళులర్పించారు.


కేపీహెచ్‌బీలో జయశంకర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు తదితరులు


వివేకానందనగర్‌లో ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, నాయకులు


గచ్చిబౌలిలోని 8వ బెటాలియన్‌లో జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కమాండెంట్ సి.సన్ని, సిబ్బంది


ఓల్డ్‌బోయినపల్లిలో జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు


ఫతేనగర్‌లో జయశంకర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న ఉద్యమ నాయకుడు గొట్టిముక్కల పద్మారావు, ఉద్యమ నాయకులు


పేట్‌బషీరాబాద్‌లో జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సన్నా శ్రీశైలంయాదవ్, మున్సిపల్ కమిషనర్ శ్రీహరి

'ఏహెచ్‌పీఎస్'లో ఘనంగా ఇన్వెస్టిచర్ సెరిమని-24


బ్యాడ్జీలు ధరించిన విద్యార్థులతో డైరెక్టర్ మురళీధరరెడ్డి

అమీర్‌పేట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి రామయ్యనగర్‌లో గల అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ (ఏఎచ్‌పీఎస్) పాఠశాలలో 'ఇన్వెస్టిచర్ సెరిమని'ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల డైరెక్టర్ మురళీధరరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిక చేసిన విద్యార్థులకు మురళీధరరెడ్డి బ్యాడ్జ్‌లను అందజేశారు. బ్యాడ్జీ గ్రహీతలు పాఠశాల విలువలను, సంప్రదాయాలను సమర్థిస్తామని, నిబద్ధతతో అనుసరిస్తామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం డైరెక్టర్ మురళీధరరెడ్డి విద్యార్థులను అభినందించి మాట్లాడారు. పాఠశాలలో ఎన్నికలు పెట్టి ఎంపికైన విద్యార్థులకు నాయకత్వ లక్షణాలను పెంపొందింపజేయాలని ప్రిన్సిపాల్ అల్లూరి లక్ష్మికి సూచించారు. కార్యక్రమంలో అతిథులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న 'కళాసిల్క్స్' డిజైన్లు

అల్లాపూర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): చేనేత కళాకారులను ప్రోత్సహించే సంకల్పంతో 'కళాసిల్క్స్ సొసైటీ' మోతీనగర్ కమ్యూనిటీహాల్‌లో నిర్వహిస్తున్న ఎగ్జిబిషన్‌కు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. వివిధ శుభకార్యాలకు అవసరమయ్యే అన్ని రకాల వస్తువులు ఈ ప్రదర్శనలో లభిస్తున్నాయి. మహిళలకు ప్రత్యేక ఆకర్షణీయంగా వివిధ మోడళ్లలో ఆధునిక వస్తువులు, గృహోపకరణాలతో పాటు పోచంపల్లి, ఉప్పాడ, బెనారస్, భాగల్పూర్ సిల్క్, వన్‌గ్రాం గోల్డ్ జువెల్లరీ, బెంగాల్ కాటన్ శారీస్, జైపూర్ కుర్తీస్, హరియాణా బెడ్ షీట్స్, హైదరాబాద్ ముత్యాలు అందుబాటులో ఉన్నట్టు నిర్వాహకులు తెలిపారు. 25వ తేదీ వరకూ ఈ ప్రదర్శన ఉంటుందని, ప్రజలు దీనిని సద్వినియోగపర్చుకోవాలని ప్రదర్శన ప్రతినిధి వికాస్‌జైన్ కోరారు.


డిజైనర్ వేర్‌ను చూపిస్తున్న స్టాల్ యజమానులు

బాచుపల్లి పీఎస్‌కు మెరిటోరియల్ సర్టిఫికెట్


డీజీపీ చేతుల మీదుగా సర్టిఫికెట్‌ను అందుకుంటున్న బాచుపల్లి సీఐ ఉపేందర్

నిజాంపేట్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రజల భద్రత కోసం చట్టపరంగా చేపడుతున్న సేవలను గుర్తించి బాచుపల్లి పోలీస్‌స్టేషన్‌కు మెరిటోరియల్ సర్టిఫికెట్‌ను రాష్ట్ర డీజీపీ చేతుల మీదుగా బాచుపల్లి సీఐ ఉపేందర్ మంగళవారం అందుకున్నారు. మంగళవారం రెండు హత్య కేసుల్లో జీవిత ఖైదు, మరో కేసుల్లో 10 సంవత్స రాల నిందితులకు శిక్షణ పడిన నేపథ్యంలో అర్ధ వార్షిక నేర సమీక్ష సమావేశంలో ఈ సర్టిఫికెట్‌ను రాష్ట్ర డీజీపీ సర్టిఫికెట్‌ను సీఐ ఉపేందర్ అందజేశారు.

మద్యం మత్తులో స్నేహితుడిపై బీర్‌బాటిల్‌తో దాడి


గౌస్ గాయానికి కట్టుకడుతున్న మధుసూదన్

దుండిగల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): గాగిల్లాపూర్ గ్రామంలో మద్యంమత్తులో ఇద్దరు యువకుల మధ్య ఘర్షణ జరిగింది. అడ్డుకోబోయిన మరో స్నేహితుడుపై బీర్‌బాటిల్‌తో గొంతుపై దాడి చేయడంతో గాయపడ్డాడు. దుండిగల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గాగిల్లాపూర్ గ్రామానికి చెందిన మధుసూదన్(25) సాయి(26), సయ్యద్‌గౌస్(25) స్నేహితులు. కూలీ పనులు చేసుకోవడం, ఆటో నడపడం వంటి పనులు చేస్తుంటారు. వచ్చిన డబ్బుతో గంజాయి, మ ద్యం తాగేవారు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం గాగిల్లాపూర్‌లో ముగ్గురు కలిసి మద్యం తాగారు. ఈ క్రమంలో మధుసూదన్‌కు, సాయికి మధ్య ఘర్షణ జరిగింది. ఒకరిపై ఒకరు దూషించుకుంటూ దాడులు చేసుకొనే పరిస్థితి వచ్చింది. ఇది గమనించిన సయ్యద్ గౌస్ ఘర్షణను ఆపే ప్రయత్నం చేశాడు. మరింత రెచ్చిపోయిన మధుసూదన్ బీర్ బాటిల్ పగలుకొట్టి గౌస్ గొతుపై పొడిచాడు. విషయాన్ని స్థానికులు దుండిగల్ పోలీసులకు తెలియజేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు గాయపడిన యువకుడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మిగతా ఇద్దరిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. గంజాయి మత్తులో ఎప్పుడు ఏ సంఘటన జరుగుతుందోనని, ఈ గంజాయి బ్యాచ్‌పై పోలీసులు నిఘా ఉంచాలని స్థానికులు కోరుతున్నారు.

ఎఫ్ఏబీపీ ఆధ్వర్యంలో ఇన్నోవేషన్ సమ్మిట్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): లైఫ్‌సైన్స్ రంగంలో లేటెస్ట్ అప్డేట్స్‌పై అవగాహన కల్పించేందుకు ఫెడరేషన్ ఆఫ్ ఏషియన్ బయోటెక్ అసోసియేషన్ (ఎఫ్ఏబీపీ) ఆధ్వర్యంలో నగరంలో ఇన్నోవేషన్ సమ్మిట్‌ను నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ ప్రొఫెసర్ పి.రెడ్డన్న తెలిపారు. సోమాజిగూడలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫెడరేషన్ ఆఫ్ ఫార్మా అంత్రప్రెన్యూర్స్ చైర్మన్ చక్రవర్తితో కలిసి ఆయన మాట్లాడారు. ఈనెల 16న రగ్ డిస్కవరీ అండ్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్, 17న వేల్‌ట్యాంక్, 18 లైఫ్ సైన్సెస్ ఇన్నోవేషన్ క్లస్టర్ మీట్‌ను కలిపి మొత్తం మూడు ఈవెంట్లు హైదరాబాద్ యూనివర్సిటీలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లైఫ్ సైన్సెస్ రంగంలో విస్తృత సేవలు అందించిన వారికి బహుమతులు అందజేస్తామని ఆయన పేర్కొన్నారు.

ఇన్‌కాయిస్‌లో ఘనంగా నేషనల్ స్పేస్ డే


సదస్సును ప్రారంభిస్తున్న డాక్టర్ రవిచంద్రన్

నిజాంపేట్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): నేషనల్ స్పేస్ డే సందర్భంగా నిజాంపేట్ ఇన్‌కాయిస్ సెంటర్‌లో మంగళవారం ఇన్‌కాయిస్, ఎంఓఈఎస్ సంయుక్తంగా ఒక రోజు సదస్సు నిర్వహించారు. ఎన్ఆర్ఎస్, ఇస్రో సహకారంతో నిర్వహించిన ఈ సదస్సులో నీసా మాజీ డైరెక్టర్ డాక్టర్ శైలేష్‌నాయక్, ఎంఓఈఎస్ సెక్రటరీ డాక్టర్ ఎం.రవిచంద్రన్‌లు కీనోట్‌ను వెల్లడించారు. ఈ సందర్భంగా శైలేష్‌నాయక్ మాట్లాడుతూ ఆకాశం, సముద్రాలలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు గుర్తించడంలో ఇన్‌కాయిస్, ఇస్రో పాత్ర ఎంతో ఉన్నతమైనదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. 15 పాఠశాలల విద్యార్థులు ఈపోటీలో పాల్గొన్నారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌కాయిస్ డైరెక్టర్ డాక్టర్ టి.శ్రీనివాస్‌కుమార్, డాక్టర్ బాలకృష్ణ, డాక్టర్ హర్షకెగుప్తా పాల్గొన్నారు.

మనస్తాపంతో భర్త ఆత్మహత్య

పేట్‌బషీరాబాద్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): భార్యాభర్తలు గొడవ పడడంతో భార్య ఇంట్లో నుంచి వెళ్లిపోవడంతో మనస్తాపానికి గురైన భర్త ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పేట్‌బషీరాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ పల్నాడుకు చెందిన మణిరాజు చక్రవంశివర్మ(28) బతుకుదెరువు కోసం వలస వచ్చి కుత్బుల్లాపూర్ వాజ్‌పేయినగర్‌లో ఉంటూ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. భార్యాభర్తల మధ్య మంగళవారం గొడవ జరగడంతో భార్య ఫోన్ ఇంట్లోనే వదిలేసి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురైన మణిరాజు చక్రవంశివర్మ ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు గమనించిన స్థానికులు పేట్‌బషీరాబాద్ పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్న మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డివైడర్‌ను దాటుతుండగా యువకుడిని ఢీకొట్టిన కారు


గాంధీలో చికిత్స పొందుతున్న యువకుడు

బాలానగర్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): బాలానగర్ ఫ్లై ఓవర్ సమీపంలో కొత్తగా నిర్మించిన డివైడర్‌ను ఎక్కి దిగి శోభానా బస్టాపు వైపునకు వెళ్తున్న ఓ యువకుడు(26)ని బోయినపల్లి నుంచి వస్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో యువకుడికి తీవ్రగాయాలు అయ్యాయి. అతడిని వెంటనే స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందజేసి అనంతరం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆ యువకుడు ప్రాణహానీ లేకున్నా అపస్మారకదశలో గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని బాలానగర్ ఎస్సై మక్బూల్ పాష తెలిపారు. అతడు ఏ ప్రాంతానికి చెందిన వాడో తెలియలేదన్నారు. బాధితుడిని గుర్తించిన వారు బాలానగర్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్సై సూచించారు.

హెచ్ఎండీఏ మొక్కల పంపిణీ షురూ

హైదరాబాద్ సిటీ, ఆగస్టు6 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మంగళవారం హెచ్ఎండీఏ పరిధిలో వివిధ ప్రాంతాల్లో మొక్కల పంపిణీని ప్రారంభించారు. దాదాపు 45 నర్సరీల నుంచి కోటి మొక్కలను ఉచితంగా పంపిణీ చేయాలని అర్బన్ ఫారెస్టు విభాగం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం హెచ్ఎండీఏ పరిధిలోని అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, పంచాయతీలలో మొక్కలను పంపిణీ చేయడానికి ప్రణాళికలను సిద్ధం చేసి అమల్లోకి తీసుకొచ్చింది. వివిధ పార్కుల వద్ద, ఔటర్ రింగ్‌రోడ్డు టోల్‌బూత్‌ల వద్ద మొక్కలను ఉచితం అందజేశారు. వాహనాలను ఏర్పాటు చేసి కాలనీల్లో పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. హెచ్ఎండీఏ నర్సరీల్లో అనేక రకాల పూలు, పండ్ల జాతుల మొక్కలున్నాయని, ముఖ్యంగా బంతి, మందార, మల్లె, ఎగ్జోరా, గ్లుమెరియా పూల మొక్కలు, నేరడు, జామ, దానిమ్మ, పనస తదితర పండ్ల మొక్కలు సిద్ధంగా ఉన్నాయని అధికారులు తెలిపారు.


విద్యార్థులకు మొక్కల పంపిణీ చేస్తున్న

డివిజన్‌లో పెండింగ్ పనులను పూర్తి చేస్తాం

ఫతేనగర్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఫతేనగర్ డివిజన్ ఫైప్‌లైన్ రోడ్డులో ఉన్న బేకరీలైన్, నేతాజీ కాలనీలో రూ.40 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్లను కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ మంగళవారం పరిశీలించారు. డివిజన్‌లో 90 శాతం వరకు మౌలిక సదుపాయాల రూపకల్పన జరిగిందని, మిగిలిన 10 శాతంను కూడా త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో డివిజన్ ఏఈ పవన్, నాయకులు కంచి భిక్షపతి, వెంకట్రామ్, నర్సయ్య, కంచి స్వామి, వెంకటేశ్, రాముముదిరాజ్, నందు, సత్యనారాయణ, శ్రీనివాస్‌గుప్తా, భూంరావ్ తదితరులు పాల్గొన్నారు.


రాయదుర్గం: గోపన్‌పల్లిలోని కమ్యూనిటీహాల్ వద్ద మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, డీసీ రజనీకాంత్‌రెడ్డి


బయోడైవర్సిటీ కూడలిని పరిశీలిస్తున్న జడ్సీ ఉపేందర్‌రెడ్డి, అధికారులు

కొనసాగుతున్న 'స్వచ్ఛదనం-పచ్చదనం'

(కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, శేరిలింగంపల్లి జోన్‌బృందం)

కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, శేరిలింగంపల్లి నియోజకవర్గాల్లో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం రెండో రోజూ మంగళవారం కొనసాగింది. ఈ సందర్భంగా మొక్కలు నాటడంతో పాటు చెత్త, మట్టికుప్పలను తొలగించారు. రోడ్లకు మరమ్మతులు చేసి మొక్కలు పంపిణీ చేశారు. పరిసరాల పరిశుభ్రతపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు.


స్వచ్ఛదనం, పచ్చదనంలో భాగంగా ఓల్డుబోయినపల్లిలో పర్యటిస్తున్న జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌తో సర్కిల్ అధికారులు


కేపీహెచ్‌బీకాలనీలోని చిత్తారమ్మనగర్‌లో అధ్వానంగా ఉన్న రోడ్డును పరిశీలిస్తున్న కార్పొరేటర్ పగుడాల శిరీష


హైదర్‌నగర్ రాంనరేష్‌నగర్‌లో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ వాత్సవ్, స్థానికులతో కలిసి మొక్కలు నాటుతున్న కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు